అన్ని వర్గాలకు అండగా నిలిచాం





మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

- పదేళ్లలో చేయనిది.. పది నెలల్లో చేసి చూపించాం
- రామగుండంలో ఎయిర్ పోర్టు
- మంథనిలో కోకోకోలా ఫ్యాక్టరీ
- శాతవాహనలో ఇంజనీరింగ్, లా కళాశాలలు ఏర్పాటు చేస్తాం
- పెద్దపల్లి యువ వికాసం సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సభ సక్సెస్‌తో కాంగ్రెస్‌లో జోష్

'అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం.. ప్రజలు ఇవన్నీ గమనించి ప్రభుత్వానికి అండగా నిలవాలి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో యువ వికాసం బహిరంగ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు సాగునీరు సరఫరా చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. రామగుండానికి ఎయిర్ పోర్టు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ శాతావాహన విశ్వవిద్యాలయానికి ఇంజినీరింగ్, లా కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

- పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్, ఆంధ్రజ్యోతి

7



సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



సభలో పాల్గొన్న ప్రజలు

అంగారిక టౌన్ షిప్‌ను అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంగారిక టౌన్‌షిప్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని రామకృష్ణ కాలనీలో గల అంగారిక టౌన్ షిప్ (రాజీవ్ స్వగృహ)లో సుడా నిధులతో చేపట్టిన అంతర్గత రహదారుల నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూమిని వేలం వేసి ప్రజలకు అమ్మేశారని, ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. ఇక్కడ ప్లాట్లు కొనుక్కున్న వారు మూడేళ్లుగా ఇబ్బందిపడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి స్పందించి టౌన్ షిప్ అభివృద్ధికి నిధులు కేటాయించారని తెలిపారు. టౌన్‌షిప్‌లో మొదట గ్రావిలింగ్ పనులు చేసి ప్రభుత్వం ద్వారా మరిన్ని నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి పాల్గొన్నారు.

భూ కంపంతో కలకలం

- భయాందోళనకు గురైన ప్రజలు



కరీంనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బుధవారం ఉదయం 7.25 నుంచి 7.30 గంటల మధ్య కొన్ని సెకన్ల పాటు జిల్లా కేంద్రంతోపాటు పలుచోట్ల భూమి కంపించింది. దీంతో చాలా చోట్ల ప్రజలు ఆందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. కొన్నిచోట్ల కిటికీలు, సెల్ఫ్‌లో ఉన్న వస్తువులు, బెడ్స్, చైర్లు, స్వల్పంగా కదిలాయి. ఇళ్లలో ఉన్న ప్రజలు తిప్పినట్లయిందని ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం కొద్ది నిమిషాల్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. జిల్లాలో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయనే వార్తలు వ్యాపించడంతో ఒకరికొకరు ఫోన్ చేసుకొని మా ప్రాంతంలో భూమి కొంత కంపించిందని, మీ ప్రాంతంలో భూకంపం వచ్చిందా అంటూ మాట్లాడుకున్నారు. మధ్యాహ్నం వరకు ఎవరి నోట విన్నా భూకంపంపైనే చర్చ జరిగింది. జిల్లావ్యాప్తంగా ఎక్కడ కూడా ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరుగక పోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. భూ ప్రకంపనలు నిజమేనంటూ గుర్తించిన శాస్త్రవేత్తలు ఈసారి రెక్టర్ స్కేల్‌పై 5.3వరకు నమోదైందని తెలిపారు.

ఇంగ్లీష్.. మేడ్ ఈజీ

- జంగపల్లి ప్రభుత్వ పాఠశాలకు టెడ్-ఎడ్ లైసెన్స్
- విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టు, విషయపరిజ్ఞానం పెంపొందించేందుకు కృషి
- గ్రామీణ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగేందుకు తొలిమెట్టు

- గన్నేరువరం, ఆంధ్రజ్యోతి

6

జనవరి 1 నుంచి యాసంగికి సాగునీరు

- రైతులు నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలి
- ఇరిగేషన్ ఈఈ‌ఎస్‌ఈ శంకర్

- తిమ్మాపూర్, ఆంధ్రజ్యోతి

7

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన

- మంత్రి పొన్నం ప్రభాకర్



వెంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్యవైపు ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా కరీంనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా అన్ని ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. మానవ సహజ కార్యక్రమంలో భగవ ంతుడి సంకల్పం ఉండాలన్నారు. రాబోయే కాలంలో తెలంగాణ ప్రజలకు ఎలాంటి కష్టం లేకుండా సమృద్ధిగా వర్షాలు పడి తెలంగాణ ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపడాలని పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న ప్రభుత్వాన్ని గాడిన పెడుతూ ఉద్యోగులకు ఒకటో తారీకున జీతాలు ఇస్తూ దేశంలోనే 29 రాష్ట్రాల్లో ఏ రాష్ట్రం చేయని విధంగా రెండు లక్షల రైతు రుణమాఫీ అమలు చేశామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉన్న ఈ ప్రభుత్వానికి దేవుడితోపాటు ప్రజల ఆశీర్వచనం ఉండాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంటు ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సుభాష్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆశావర్కర్లకు ఎన్నికల మేనిఫేస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫేస్టోలో పొందుపరిచిన హామీలు, 2024లో ఆరోగ్యశాఖ కమిషనర్ ఇచ్చిన హామీలు, 2023లో నిరవధిక సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేపల్లి శ్రీలత మాట్లాడుతూ ఆరు నెలల పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలని, లెప్రసీ సర్వే డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు రంగమ్మనేని శారద, ఉపాధ్యక్షురాలు రాజమణి, పద్మ, సత్యలక్ష్మి, రజిత, లక్ష్మి, కార్యదర్శులు భాగ్యలక్ష్మి, లత, ప్రియాంక, శంకరమ్మ, శ్యామల, సదా, పద్మ పాల్గొన్నారు.

'బల్దియా'లో మెరుగైన పాలన

- ఐదుగురు అధికారులకు విభాగాల వారిగా డెలిగేషన్ పవర్స్
- ఉత్తర్వులు జారీ చేసి కమిషనర్



కరీంనగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో మెరుగైన పాలనకు కమిషనర్ చాహత్ బాజ్‌పాయి శ్రీకారం చుట్టారు. ఐదుగురు ఉన్నతాధికారులకు ప్రత్యేక బాధ్యతలను అప్పగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరపాలక సంస్థలో అత్యంత కీలకమైన పెన్షన్స్ అండ్ డిజిటల్ కీ, రెవెన్యూ, సానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్, వాటర్ సప్లయి, స్ట్రీట్‌లైట్స్ నిర్వహణ కోసం ఐదుగురు అధికారులకు ప్రత్యేకంగా బాధ్యతలను అప్పగించారు. ఇప్పటి వరకు శానిటేషన్ నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తున్న అడిషనల్ కమిషనర్ జె సువార్తను ఆ బాధ్యతలనుంచి తప్పించి ఆమెకు డిజిటల్ కీతోపాటు పెన్షన్లను, బర్త్ అండ్ డెత్, డిజిటల్ కీ, ప్రజాపాలన, ట్యాప్‌సెక్షన్ డిజిటల్ కీ బాధ్యతలను అప్పగించారు. డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణికి, ఎస్టాబ్లిష్‌మెంట్, రెవెన్యూ, ప్రజావాణి, మెప్మా విభాగాల డ్యూటీలను అప్పగించారు. అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్‌కు అత్యంత కీలకమైన శానిటేషన్, ట్రేడ్ లైసెన్సు, ఏబీసీ సెంటర్, డంపింగ్‌యార్డు బాధ్యతలను చూడాలని ఆదేశించారు. ఎస్‌ఈ పి రాజ్‌కుమార్‌కు ఇంజనీరింగ్ సెక్షన్‌తోపాటు కార్యాలయ నిర్వహణ, వాటర్ సప్లయి, స్ట్రీట్ లైట్ల వంటి బాధ్యతలను అప్పగించారు. టౌన్‌ప్లానింగ్‌కు చెందిన ఏసీపీ వేణుకు టౌన్‌ప్లానింగ్ బాధ్యతలతోపాటు జనాభా, ఎన్నికల వంటి అదనపు బాధ్యతలను అప్పగించారు. కొంత కాలంగా ఆయా విభాగాల్లో సేవలు సరిగా జరుగడం లేదని, కొంత మంది అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ కమిషనర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ విభాగాలను మార్పుతూ ఆదేశాలు జారీ చేశార

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతను పెంచాలి

- ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎస్ కృష్ణఆదిత్య

కరీంనగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా ర్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు ప్రిన్సి పాల్, అధ్యాపకులు కృషిచేయాలని ఇంటర్మీడి యట్ బోర్డు కార్యదర్శి, ఇంటర్ విద్యా సంచా లకుడు ఎస్ కృష్ణఆదిత్య అన్నారు. నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో మూడు నెలల్లో పరీక్షలు జరుగనున్నందున కళాశాలల వారీగా 90రోజుల ప్రణాళిక రూపొందించా లన్నారు. గైర్హాజరవుతున్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కళాశాలకు పిలిపించి మాట్లా డాలని సూచించారు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విజ యం సాధించిన విద్యార్థులకు మెడల్స్ ప్రధా నం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడి యట్ విద్యాధికారి జి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సి పాల్స్ సత్యవర్ధన్‌రావు, నిర్మల, అధ్యాపకులు పాల్గొన్నారు.

అడవులు, వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

- జిల్లా అటవీశాఖ అధికారి సీహెచ్ బాలామణి



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భావితరాల మనుగడ కోసం అడవులు, వన్య ప్రాణుల సంరక్షించు కోవాలని జిల్లా అటవీశాఖ అధికారి సీహెచ్ బాలామణి అన్నారు. ప్రపంచ వన్య ప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జింకల పార్క్‌లో బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావితరాలు బాగుండాలంటే ప్రకృతిని సంరక్షించుకోవాలన్నారు. అడవుల ప్రాధా న్యంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వ హించి విద్యార్థులకు బహుమతులు అంద జేశారు. ప్రథమ బహుమతి శ్రీహర్ష, ద్వితీయ బహుమతి నాని, తృతీయ బహుమతి సూర్య తేజ సాధించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ హుస్సేన్, డిప్యూటీ రేంజి ఆఫీసర్ ఏ ఆనంద్‌కుమార్, నర్సింగరావు, బాపురాజు, శేఖర్, శ్రీనివాస్ సుజాత, నరేష్, ప్రవీణ్, అనంతరాం పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రీడల సందడి

- సీఎం కప్ పోటీల నిర్వహణకు సన్నాహాలు

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో క్రీడల సందడి నెలకొననుంది. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్-24 క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామ పంచాయతీ, 10, 12 మండల స్థాయిలో, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో, 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్రస్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీలు జరగనున్నాయి.



చెల్పూర్ జడ్పీహెచ్ఎస్‌లో ఖోఖో ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు

వివిధ క్రీడాంశాల్లో పోటీలు

సీఎం కప్ క్రీడా పోటీలకు ఔత్సాహిక గ్రామీణ క్రీడకారులకు వేదికలా ఉపయోగపడనుంది. ఈ పోటీలతో గ్రామీణ ప్రాంతాల్లో క్రీడకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే అవకాశం ఉం టుంది. అర్చరీ, అథ్లెటిక్స్, అత్యపత్య, బ్యాడ్మింటన్, బేస్ బాల్, బాస్కెట్‌బాల్, బిలియర్డ్ స్నూ కర్, బాక్సింగ్, కనోయింగ్- కయాకింగ్, చెస్, సైకింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్, హ్యాండ్ బాల్, హాకీ, జూడో, కడ్డీ, కరాటే, ఖోఖో, కిక్ బాక్సింగ్, లాన్ టెన్నిస్, నెట్‌బాల్, పవర్ లిఫ్టింగ్, సెపక్ తక్రా, షూటింగ్, సాఫ్ట్‌బాల్, స్క్వాష్, సిమ్మింగ్, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, యోగా అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

మంచి అవకాశం

- చిరుత శ్రీనివాస్, పీడీ, చెల్పూర్



సీఎం కప్ క్రీడలు ఔత్సాహిక క్రీడకారులకు మంచి అవకాశం. గ్రామీణ క్రీడకారుల్లో దాగి ఉన్న క్రీడ నైపుణ్యం బయటికి వస్తుంది. సీఎం కప్ క్రీడలతో జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది.

సద్వినియోగం చేసుకోవాలి

-భూపతి శ్రీనివాస్, ఎంఈవో, హుజూరాబాద్



సీఎం కప్ క్రీడా పోటీలను క్రీడా కారులు సద్వినియోగం చేసుకోవాలి. సీఎం కప్ పోటీల్లో ప్రతి క్రీడకారుడు పాల్గొనాలి. జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ అన్నపూర్ణ కాలనీకి చెందిన పోరకండ్ల మల్లారెడ్డి(50) మృతదేహం పూర్తిగా కాలిపోయి, కుళ్లిన స్థితిలో పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. కాలనీ నుంచి ఆర్‌ఎఫ్‌సీఎల్ వెళ్లే దారి చెట్ల పొదల్లోని డంప్‌యార్డులో ద్విచక్రవాహనం దహనం చేసి అతనూ ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అన్నపూర్ణ కాలనీకి చెందిన మల్లారెడ్డి సెంటినరీ కాలనీలోని రెస్టారెంట్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నాడు. ఈనెల 1న రెస్టారెంట్ నుంచి పని ముగించుకుని వెళ్లిన మల్లారెడ్డి కనిపించకుండా పోయాడు. ఆయన కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 3వ తేదీన రామగిరి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా, మేకల కాపరి గుర్తించడంతో బుధవారం ఘటన వెలుగు చూసింది. పూర్తిగా కాలిపోయిన స్థితిలో కేవలం ఛాతీ, చేతులు, తల భాగం మాత్రమే ఉండగా కాళ్లు కుక్కలు తిన్న ఆనవాళ్లు ఉన్నాయి. 1వ తేదీన రాత్రి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రామగిరి పోలీసులు పంచనామా నిర్వహించి గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తె సాహితి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై కేసు

రుద్రంగి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) భూమి పట్టా చేపిస్తానని చెప్పి పలుమార్లు డబ్బులు వసూలు చేసి బెదిరించిన తిరుపతి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి నట్లు చందుర్తి సర్కిల్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన శీలం పద్మ, హనుమక్క అనే మహిళలకు వారసత్వంగా వస్తున్న భూమి వివాదంలో ఉండగా మధ్యలో పెద్ద మనిషిగా వచ్చిన తిరుపతి రూ.లక్ష ఇస్తేనే పద్మ పేరుపై రిజిస్ట్రేషన్ చేపిస్తానని బెదిరించిన దానిపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇంగ్లీష్ మేడ్ ఈజీ..





జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

- జంగపల్లి ప్రభుత్వ పాఠశాలకు టెడ్-ఎడ్ లైసెన్స్
- విద్యార్థులకు ఆంగ్లభాషపై పట్టు, విషయ పరిజ్ఞానం పెంపొందించేందుకు కృషి
- గ్రామీణ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగేందుకు తొలిమెట్టు

గన్నేరువరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆంగ్లభాషలో ప్రావీణ్యం, విషయ పరిజ్ఞానం, అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయంగా పలు దేశాల్లో టెడ్-ఎడ్ (టెక్నాలజీ ఎంటర్‌టైన్‌మెంట్ ఆఫ్ డిజైన్ ఎడ్యుకేషన్) కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎంపికైంది. రాష్ట్రంలోని కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలు టెడ్-ఎడ్ లైసెన్స్ పొందినప్పటికీ ప్రభుత్వ పాఠశాలలు ఇప్పటివరకు ఇలాంటి కార్యక్రమాలకు ఎంపిక కాలేదు. జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మొట్టమొదటిసారి ఈ అవకాశం లభించింది. టెడ్-ఎడ్ ప్రోగ్రాంలో 8,9,10వ తరగతుల విద్యార్థులకు ఆంగ్ల భాషలో పట్టు సాధించేందుకు సొంత ఆలోచనలతో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేలా వారిలోని ప్రజ్ఞ, ప్రతిభను వెలికితీసే వేదికగా టెడ్-ఎడ్ కార్యక్రమాలు చేపడుతోంది.

విద్యార్థుల సొంత ఆలోచనలతో..

విద్యార్థులకు ఉన్న సొంత ఆలోచనలతో ఆంగ్లభాషపై పట్టు, విషయ పరిజ్ఞానం ప్రదర్శిస్తూ విద్యార్థులు మాట్లాడుతుండగా చిత్రీకరించిన వీడియోలను టెడ్-ఎడ్ కార్యక్రమంలో ప్రదర్శిస్తారు. టెడ్- ఎడ్‌కు ఎంపికైన విద్యార్థులు గ్రామస్థాయి నుంచి ప్రపంచ స్థాయిలో ఆంగ్ల భాషలో పట్టు సాధించడమే కాకుండా భవిష్యత్‌లో విదేశాలలో ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు ఉపయోగకరంగా ఉండేందుకు టెడ్-ఎడ్ వేదిక కానుంది. జంగపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద ప్రోత్సాహంతో ఉపాధ్యాయులు శ్రీనివాస్, వసుంధర, రాజమౌళి విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించారు. 2021 నుంచి జంగపల్లి పాఠశాల పేరుతో యూట్యూబ్, ఫేస్‌బుక్ ఛానల్ ఏర్పాటు చేసి అందులో విద్యార్థుల వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యారులతో ఆంగ్ల భాషపై చిత్రీకరించిన 345 వీడియోలను టెడ్-ఎడ్ లైసెన్స్ పొందిన జిల్లా కేంద్రంలోని పారమిత విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇటీవల ప్రదర్శించారు. అందులో రెండు జంగపల్లి పాఠశాల విద్యార్థుల వీడియోలను ఎంపిక చేశారు. జంగపల్లి పాఠశాల విద్యార్థులు కనబరచిన అత్యుత్తమ ప్రతిభతో పాఠశాలకు టెడ్-ఎడ్ లైసెన్స్ లభించింది.


ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో పాఠశాల ఎచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు

టెడ్-ఎడ్ లైసెన్స్ పొందడం గర్వకారణం

- కొత్తపల్లి శారద, ప్రధానోపాధ్యాయురాలు



ప్రభుత్వ పాఠశాలకు ప్రథమంగా టెడ్-ఎడ్ లైసెన్స్‌ను జంగపల్లి జడ్పీ హైస్కూల్ పొందడం గర్వకారణంగా ఉంది. మా పాఠశాల ఉపాధ్యాయులు చేసిన కృషి వల్లే ఇది సాధ్యమైంది. టెడ్-ఎడ్ కార్యక్రమంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మారుమూల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆంగ్లభాషపై వారికున్న ప్రతిభను వెలికితీసి మరింత శిక్షణ ఇవ్వడానికి కృషి చేస్తాం.

మారుమూల విద్యార్థులకు గుర్తింపు

- జి శ్రీనివాస్, ఉపాధ్యాయుడు



మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు టెడ్-ఎడ్ ప్రోగాంకు ఎంపికైతే వారికి ప్రపంచ స్థాయిలో 130 దేశాల్లో గుర్తింపు లభిస్తుంది. ఆంగ్ల భాషపై పట్టు సాధించడానికి వారి ప్రతిభను గుర్తించి వీడియోలను తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం విద్యార్థుల్లో మరింత ఆసక్తి పెంచింది.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే..

- సాత్విక, హాసిని, విద్యార్థినులు



మా పాఠశాలకు టెడ్-ఎడ్ లైసెన్స్ రావడం చాలా సంతోషంగా ఉంది. మా టీచర్లు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా శిక్షణ ఇస్తున్నారు. వారి కృషితోనే ఇటీవల జరిగిన పోటీల్లో ప్రతిభచూపాం. ఈనెల 9న జిల్లా కేంద్రంలో జరగనున్న టాప్ 20లో మేము పాల్గొంటున్నాం.

ఒకరిపై గొడ్డలితో దాడి

శంకరపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలోని ఓ వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన వారు గొడ్డలితో దాడి చేసిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి గ్రామానికి చెందిన అంతడుపుల గణేష్‌పై అదే గ్రామానికి చెందిన అంతడుపుల లక్ష్మి, ఆమె కుమారుడు తిలక్‌సాయి గొడ్డలితో దాడి చేశారు. ఈ దాడిలో గణేష్ కుడి చెవికి గాయమైంది. వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దారిదోపిడీ ఘటనలో నలుగురి రిమాండ్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద ఓ వ్యక్తిని అటకాయించి దారిదోపిడీకి పాల్పడిన సిరిసిల్ల పట్టణం పద్మనగర్‌కు చెందిన అలువాల ప్రశాంత్, సంజీవయ్యనగర్‌కు చెందిన కొండ శేఖర్, రాకమ్ భరత్, తుడిచెర్ల నిఖిల్‌ను బుధవారం రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. ఈ నెల 1న రాత్రి సిరిసిల్ల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఓ వైన్ షాప్‌లో కొల్లమద్ది భాను ప్రసాద్ అనే వ్యక్తి మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా నలుగురు వ్యక్తులు అటకాయించి బెదిరించి రూ.8 వేలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. వారి వద్ద రూ. 2వేల నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రగుడులో రెండిళ్లలో చోరీ

సిరిసిల్ల క్రైం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రగుడులోని గుగ్గిళ్ల ముత్తయ్య ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కూతురు ఇంటికి వెళ్లాడు. దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 8 తులాల బంగారం, 60తులాల వెండి అభరణాలు, రూ.44వేల నగదు ఎత్తుకెళ్లారు. బుధవారం ముత్తయ్య పోలీసులకు సమాచారం అందించాడు.ఇదే గ్రామంలో తాళం వేసి ఉన్న మరో ఇంట్లో దొంగలు చోరీ చేసినట్లు టౌన్ సిఐ కె. కృష్ణ తెలిపారు.

మాతాశిశు సంరక్షణ కేంద్రంలో స్టాఫ్‌నర్స్ అనుమానాస్పద మృతి


చెరుకు సమ్మక్క(ఫైల్)

కరీంనగర్ క్రైం/సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మాతా శిశు ఆసుపత్రిలో విధి నిర్వహణలో ఉన్న ఈఎన్‌ఎం స్టాఫ్ నర్స్ చెరుకు సమ్మక్క(33) బుధవారం తెల్లవారు జామున ఆసుపత్రిలోని రెస్ట్‌రూంలో అనుమానాస్పద స్థితిలో మరణించింది. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఆమె మరణించిందని కుంటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామడుగు మండలం గుండి గ్రామానికి చెందిన సమ్మక్క ప్రస్తుతం కొత్తపల్లి మండలం రేకుర్తిలో నివాసం ఉంటూ 8 సంవత్సరాలుగా కరీంనగర్ మాతా శిశు ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తోంది. మంగళవారం నైట్ డ్యూటీ కావటంతో సమ్మక్కను రాత్రి 8:45 గంటలకు ఆమె భర్త ద్విచక్రవాహనంపై ఆసుపత్రి వద్ద దింపి ఇంటికి వెళ్లాడు. రాత్రి 10:25 గంటలకు సమ్మక్క ఆమె భర్త తిరుమల్‌తో ఫోన్‌లో మాట్లాడింది. బుధవారం ఉదయం 7:30 గంటలకు సమ్మక్కతో కలిసి పనిచేసే తోటి ఏఎన్‌ఎం తిరుమల్‌కు ఫోన్ చేసి మీ భార్య రెస్ట్‌రూంలో మాట్లాడకుండా స్పృహలేకుండా పడి ఉందని సమాచారం ఇచ్చింది. వెంటనే తిరుమల్ ఆసుపత్రికి వెళ్ళిచూడగా తన భార్య సమ్మక్క ఐసీయూలో స్ట్రెచర్‌పై చనిపోయి ఉంది. అక్కడి తోటి నర్సులను అడగగా సమ్మక్క డ్యూటీ చేస్తుండగా మంగళవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో తనకు నలతగా ఉందని, కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటానని చెప్పి రెస్ట్‌రూంలోకి వెళ్లి పడుకుందని చెప్పినట్లుగా మృతురాలి భర్త పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బుధవారం ఉదయం రెస్ట్‌రూం శుభ్రం చేసేందుకు వెళ్లిన మహిళ చూడగా సమ్మక్క కదలకుండా ఉండటాన్ని గమనించి నర్సులకు తెలిపింది. డ్యూటీ డాక్టర్ వచ్చి పరీక్షించగా అప్పటికే ఆమె మరణించినట్లుగా నిర్ధారించినట్లు తెలిపారు. డ్యూటీలో ఉన్న ఆసుపత్రి ఉద్యోగులను విచారించి, సీసీ కెమెరాలను పరిశీలించి తన భార్య సమ్మక్క మృతిపై న్యాయం చేయాలని మృతురాలి భర్త తిరుమల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ పోలీసులు తెలిపారు.

సిబ్బంది నిర్లక్ష్యం లేదు

-జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ వీరారెడ్డి

సమత రక్తహీనతతో బాధపడుతున్నట్లుగా తెలిసింది. అదే సమస్యతో మరణించింది. ఇందులో డాక్టరు, సిబ్బంది నిర్లక్ష్యం లేదు. సీసీ ఫుటేజీలను కూడా పరిశీలించాం. స్టాఫ్ నర్స్ మృతిచెందిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. కలెక్టర్ వెంటనే స్పందించి మృతురాలి ఇద్దరు పిల్లలకు చెరో లక్ష రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో ఏమైనా ఉద్యోగావకాశాలు వస్తే మృతురాలి భర్తకు ప్రాధాన్యత ఇస్తాం.

మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి...

విధి నిర్వహణలో ఉండి అనారోగ్యంతో మరణించిన సమ్మక్క కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. బుధవారం ఆసుపత్రిలో మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఘటనపై న్యాయ విచారణ జరిపి ఆ కుటుంబానికి 25లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్ ఆదేశాలతో అక్రమ నిర్మాణాల కూల్చివేత


నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

రుద్రంగి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) రుద్రంగి మండల కేంద్రంలో 428 సర్వే నెంబర్లో ప్రభుత్వ భూములలో అక్రమంగా నిర్మించిన ఇంటి నిర్మాణాలను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో బుధవారం సాయంత్రం కూల్చేశారు. బుధవారం ఉదయం ఏటీసీ కళాశాల నిర్మాణ కోసం స్థల పరిశీలన సమయంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను గుర్తించిన జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆర్డీఓ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీలతకు వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. ఎక్స్‌కావేటర్ సహాయంతో అక్రమ నిర్మాణాలను పోలీసులు బందోబస్తు మధ్య తొలగించారు.

స్థానికత ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలి

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానికత ఆధారంగానే ఉపాధ్యాయుల సర్దుబాటు జరిగేలా చూడాలని స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు పర్వత రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్టీయూ భవన్‌లో సంఘ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పర్వతరెడ్డి మాట్లాడుతూ 317జీవో బాధితుల సమస్యల పరిష్కారానికి వేసిన మంత్రివర్గ ఉపసంఘంతో ఒరిగిందేమిలేదని, కేవలం కాలయాపన మాత్రమే జరిగిందన్నారు ఎన్నికల హామీ మేరకు స్థానికత కోల్పోయి ఇతర జిల్లాలకు కేటాయించబడిన ఉపాధ్యాయులను స్థానిక జిల్లాలకు కేటాయించి న్యాయం చేయాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం తక్షణమే అమలు చేయడం ద్వారా రూ.200కోట్లు ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కరించడంతో పాటు, తమిళనాడు తరహాలో సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, ఎస్జీటీ ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా బాధ్యులు మచ్చ శంకర్, భైరం హరికిరణ్, బాధ్యులు సదయ్య, శనిగరపు రవి, రవీందర్, భూమయ్య, బండి శ్రీనివాస్, మేకల ప్రవీణ్, శివరామకృష్ణ, అఖిల్, రవూఫ్, తిరుపతి చారి, రాజేష్, ప్రభాకర్, వెంకటేష్, గంగాధర్ తో పాటు ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి

వృద్ధుడి అదృశ్యం

కరీంనగర్ క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోతిరాంపూర్ ప్రాంతానికి చెందిన పెంచాల ప్రభాకర్‌రావు(70) అనే వృద్ధుడు నవంబరు 29 నుంచి కనపడకుండా పోయాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. ప్రభాకర్‌రావు నవంబరు 29న ఉదయం 10 గంటలకు కరీంనగర్ రూరల్ మండలం వల్లంపహాడ్ గ్రామంలోని తన భూమికి సంబంధించిన విషయంలో కరీంనగర్ రూరల్ ఠాణాకు వెళ్తున్నట్లుగా చెప్పి వెళ్లి తిరిగి రాలేదని అతని భార్య సరోజన ఫిర్యాదులో పేర్కొంది. ప్రభాకర్‌రావు తన సెల్‌ఫోన్‌ను కూడా ఇంటి వద్దనే వదిలేసి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ప్రభాకర్‌రావు ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం ఖాజీపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండలంలోని గర్షకుర్తి లో పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి డ్రైవర్లు, ట్రాక్టర్ల యాజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై తెలిపారు.


కొండగట్టులో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అంజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు

మల్యాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన-ప్రజావిజయోత్సవాలలో భాగంగా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు, వేదపండితులు స్వామి వారికి విశ్వక్సేన ఆరాధన, పుణ్యహవచనం, మన్యసూక్త హోమం, పంచసూక్తహోమం జరిపారు. అనంతరం సంగీత విభావరి, తదితర కార్యక్రమాలు సాగాయి. ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, స్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు

- కొండగట్టు ఆంజనేయస్వామిని బుధవారం హైదరాబాద్ ఇంటలిజెన్స్ ఎస్పీ శిరీష దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా వచ్చిన ఎస్పీ స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.


కొండగట్టులో ఇంటెలిజెన్స్ ఎస్పీ శిరీశను ఆశీర్వదిస్తున్న అర్చకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని మహరాజ్ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి మండలం రేకుర్తిలోని సాలెహ్‌నగర్‌కు చెందిన మెహ్రాజ్ ఖాన్(18) దుర్మరణం చెందాడని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న మెహ్రాజ్‌ఖాన్ కరీంనగర్‌లో పనిముగించుకుని సాయంత్రం 5 గంటల సమయంలో తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా ఓ కళాశాల బస్సు అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ ఢీకొట్టడంతో మెహ్రాజ్‌ఖాన్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడని తెలిపారు. ప్రమాదానికి కారణమైన కళాశాల బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

శబరిమలకు చేరుకున్న మహాపాదయాత్ర బృందం


శబరిమలకు చేరుకున్న సిరిసిల్ల అయ్యప్ప స్వాముల బృందం

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం నుంచి కేరళ రాష్ట్రంలోని శబరిమలలోని అయ్యప్ప స్వామి దేవాలయానికి అయ్యప్పస్వాములు చేపట్టిన మహాపాదయాత్ర 49వ రోజు బుధవారం శబరిమలకు చేరుకుంది. సిరిసిల్ల పట్టణంలోని శ్రీహరిహరిపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి రాచ విద్యాసాగర్ గురుస్వామి నేతృత్వంలో ప్రయాకర్‌రావు మధుసూధన్‌గురుస్వామి అధ్వర్యంలో 20 మంది అయ్యప్ప దీక్షాదారులు మహాపాదయాత్ర చేపట్టారు. అక్టోబరు 17న ప్రారంభమైన ప్రాదయాత్ర తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మీదుగా కేరళ రాష్ట్రంలోని కుమ్‌లీ గాఫ్‌లకు 47 రోజులకు అయ్యప్ప స్వాములు ఎన్నో ఒడిదోడుకులను చేధించుకుంటూ శబరిమలకు చేరుకున్నారు. అయితే అయ్యప్ప దీక్షదారులకు సిరిసిల్ల అయ్యప్ప దేవాలయం గురుస్వామి అక్కడికి వెళ్లి స్వాములందరికీ ఇరుముడులు కట్టివచ్చారు. అక్కడ ఫెంగన్ తుఫాన్ రావడంతో భారీ వర్షాలు కురుస్తున్నాయని అయ్యప్ప స్వాములు తెలిపారు. వర్షంలోనే ఇబ్బందులు ఎదుర్కొంటూ యాత్ర పూర్తి చేసినట్లు తెలిపారు. 1300 కిలోమీటర్ల దూరం 49 రోజుల మహాపాదయాత్ర చేసి బుధవారం శబరిమలకు చేరుకుని అయ్యప్పస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నట్లు అయ్యప్ప స్వాములు తెలిపారు. పాదయాత్రలో పలు ఆలయాలను దర్శించుకున్నట్లు తెలిపారు. ఈ మహాపాదయాత్రలో గురుస్వాములు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలను సందర్శించిన విద్యా కమిషన్ సభ్యులు

మల్యాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను బుధవారం విద్యా కమిషన్ సభ్యులు ప్రొ.విశ్వేశ్వర్ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌ను పరిశీలించారు. డైనింగ్‌హాల్, మరుగుదొడ్లు, స్టోర్‌రూం తదితరవి తనిఖీ చేసి భోజన తయారీకి సంబంధించి సూచనలు చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటి స్తూ నాణ్యతతో భోజనం అందించాలన్నారు. శుచి, శుభ్రత పాటించాలన్నారు. స్నానాల గదులు, మరుగుదొడ్లు నిరంతరం పరిశు భ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషన్ సభ్యుని వెంట జిల్లా కోఆర్డినేటర్ మహేశ్, ప్రిన్సిపాల్ మానస అధ్యాపకులు ఉన్నారు.


తాటిపల్లి గురుకులంలో అధ్యాపకులకు సూచనలిస్తున్న సభ్యులు

'రూ. 2లక్షలపైన తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయాలి'

హుజూరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వివిధ బ్యాంకుల్లో రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం రూ.2లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర కర్షక రైతు అభివృద్ధి సమితి నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఒక కుటుంబంలో రూ. 2లక్షలకు పైగా బ్యాంకుల్లో అప్పు తీసుకుంటే వారికి రుణమాఫీ కాలేదన్నారు. రైతులు రెండు లక్షల కంటే ఎక్కువగా ఉన్న డబ్బులను కట్టడానికి సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం ఇచ్చే రూ. 2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మిరెడ్డి, బక్కారెడ్డి, మల్లారెడ్డి, రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న ప్రజలు

ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- పదేళ్లలో చేయనిది.. పది నెలల్లో చేసి చూపించాం
- రామగుండంలో ఎయిర్ పోర్టు
- మంథనిలో కోకాకోలా ఫ్యాక్టరీ
- శాతవాహనలో ఇంజినీరింగ్, లా కళాశాలలు ఏర్పాటు చేస్తాం
- పెద్దపల్లి యువ వికాసం సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సభ సక్సెస్‌తో కాంగ్రెస్‌లో జోష్

అన్ని వర్గాలకు అండగా నిలిచాం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

బీఆర్ఎస్ పదేళ్లలో చేయనిది.. పది నెలల్లో చేసి చూపించామని, అన్ని వర్గాలకు అండగా నిలిచామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో యువ వికాసం బహిరంగ సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో, 1024.90 కోట్ల రూపాయలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు వేదికపై నుంచి శంకుస్థాపన చేశారు. 9 వేల మంది గ్రూపు 4, అసిస్టెంట్ సివిల్ సర్జన్లు, సింగరేణి ఉద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఏడు ఏజెన్సీలతో ఒప్పందం చేసుకుని, డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీఎం కప్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కొత్తగూడెం, పాల్వంచలో సింగరేణిలో ఉద్యోగా ల కోసం మొదలైన పోరాటం ప్రత్యేక తెలంగాణకు దారి తీసిందన్నారు. డాక్టర్ చిన్నా రెడ్డి 2001లో సోనియాగాంధీకి 42 మంది ఎమ్మెల్యేలతో లేఖ ఇచ్చి మలి విడత ఉద్యమాన్ని ప్రారంభించారని తెలిపారు. కరీంనగర్ అంటేనే సోనియా గాంధీ గుర్తుకు వస్తారని, 2004లో కరీంనగర్‌లో తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చేందుకు తెలంగాణ ఇస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, మంత్రిగా శ్రీధర్ బాబు ఉన్నారు కాబట్టే నేడు జిల్లాకు 1,024 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. స్థానిక నాయకులు ఇచ్చిన నివేదిక పరిశీలించి సానుకులంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు సాగునీరు సరఫరా చేసేందుకు ప్రణాళికలు తయా రు చేస్తున్నామని తెలిపారు. రామగుండానికి ఎయిర్ పోర్టు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ శాతావాహన విశ్వవిద్యాలయానికి ఇంజినీరింగ్, లా కళాశాల మంజూరు చేస్తామని, మంథనికి కోకాకోలా ఫ్యాక్టరీని తీసుక వస్తామన్నారు.



● 45 నిమిషాలపాటు ప్రసంగం

బీఆర్ఎస్ పదేళ్ల కేసీఆర్ పాలనపై మండిపడుతూనే, కేంద్ర మంత్రులు, 56 వేల ఉద్యోగాలు, రుణమాఫీపై సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి 45 నిమిషాల పాటు ప్రసంగించారు. ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రస్తావించారు. గతంలో వలే గాకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకుల గురించి మర్యాదగా మాట్లాడడం గమనార్హం.

● భారీగా తరలివచ్చిన జనం

ఈ సభకు పెద్ద ఎత్తున జనం తరలి వచ్చారు. వివిధ జిల్లాల నుంచి గ్రూపు 4 ఉద్యోగులతోపాటు ఇతర ఉద్యోగాలు పొందిన వారిని ఆర్టీసీ బస్సుల్లో తరలించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా నలుమూలల నుంచే గాకుండా, కరీంనగర్, జగిత్యాల, మంచిర్యాల, తదితర జిల్లాల నుంచి జనాలను తరలించారు.

సభకు వచ్చిన వారికి కుర్చీలు సరిపోకపోవడంతో జనమంతా వేదికకు ఎడమవైపు నిలబడి సీఎం, మంత్రుల ప్రసంగాలను ఓపికతో విన్నారు. సభకు అధికార యంత్రాంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా జనాల్ని తరలించడంలో కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ పెరిగింది. సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రు లు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ సలహా దారులు హర్కార వేణుగోపాల్‌రావు, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీలు టి జీవన్‌రెడ్డి, తానిపర్తి భానుప్రసాద రావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు మినుపాల ప్రకాశ్ రావు, ఈర్ల స్వరూప, గోపగాని సారయ్య గౌడ్ పాల్గొన్నారు.

రాహుల్‌ను ప్రధానమంత్రిని చేయాలి

టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మహేష్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. నిధులు, నీళ్ల నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం తెలంగాణను పదేళ్లపాటు దోపిడీ చేసిందని విమర్శించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల ఊబీలోకి దించి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని, అలాంటి రాష్ట్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గం ప్రణాళిక బద్ధంగా తీర్చిదిద్దుతున్నారన్నారు.

11 నెలల్లో 55 వేల ఉద్యోగాలు

జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు బాసటగా ప్రజా ప్రభుత్వంలో 11 నెలల్లో 55 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. రైతు రుణాలను సోనియాగాంధీ పూర్తి స్థాయిలో మాఫీ చేశారని, నేడు మరో మారు రాహుల్‌గాంధీ నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఏకకాలంలో చేశారన్నారు.

చిరకాల వాంఛ నెరవేరింది..

విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే



పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన బస్సు డిపో ఏర్పాటవుతుందన్నారు. నియజకవర్గంలో నాలుగు పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, పెద్దపల్లి, సుల్తానాబాద్‌కు బైపాస్ రోడ్లు, పత్తిపాక రిజర్వాయర్‌తోపాటు ఎన్నో అభివృద్ధి పనులకు సీఎం నిధులు కేటాయించారన్నారు. జిల్లా ప్రజల తరుపున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

ఎల్లంపల్లి ద్వారా రాష్ట్రానికి నీరు

మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, రామగుండం ఎమ్మెల్యే



రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ శ్రీపాద ఎల్లం పల్లి ద్వారా యావత్ తెలంగాణకు సాగునీరు, తాగునీరు అందిస్తున్నామన్నారు. రామగుండం నియోజకవర్గంలో పవర్ ప్లాంట్ నిర్మిస్తున్నందుకు సీఎంకు ధన్యవా దాలు తెలిపారు. అమృత్ పథకం, టీయూఎఫ్‌ఐడీసీ, సింగరేణి నిధుల ద్వారా రామగుండంలో అభివృద్ధి పనులు జరుగుతు న్నాయన్నారు. రామగుండం నియోజకవర్గం పై ప్రత్యేక దృష్టి సారించి ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేయాలని కోరారు.

ధర్మపురికి నిధులు మంజూరు చేయండి

అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్



ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మా ట్లాడుతూ ధర్మ పురి దేవాలయ అభివృద్ధికి గత పాలకులు 500 కోట్ల రూపాయలు ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ధర్మపురి ఆలయ అభివృద్ధికి 50 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ధర్మపురి సివరేజి లైన్ నేరుగా గోదావరి నదిలో కలుస్తోందని, పవిత్రమైన గోదావరి నది ప్రక్షాళనకు 17 కోట్లు మంజూరు చేయాలని, ధర్మపురి పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని సీఎంను కోరారు.

నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి ఎంపీ



ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లాకు పెద్ద మొత్తంలో నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేటా యించారని, ఆయనకు కృతజ్ఞతలు తెలపుతున్నానన్నారు. మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసే బాధ్యత తమపై ఉందన్నారు. రామగుండం ప్రాంతంలో ఆధునిక ఎయిర్ పోర్టు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



యువకులకు నియామక పత్రాన్ని అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి



సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు





డ్రోన్ ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి , యువతులతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రి శ్రీధర్‌బాబు, విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలో బుధవారం జరిగిన కాంగ్రెస్ యువ వికాస సభలో సీఎం రేవంత్‌రెడ్డిని కలసిన అల్ఫోర్స్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని శాతవాహన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఉమేష్ కుమార్ అన్నారు. విశ్వవిద్యాలయంలోని లైబ్రరీ ఆడిటోరియంలో శాతవాహన యూనివర్సిటీ స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌ను బుధవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి కోసం ఈ సెంటర్ ప్రారంభించామన్నారు. ఆచార్య జి దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. రిజిస్ట్రార్ వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ప్రత్యేక మెళకువలు నేర్చుకొని ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ జాఫర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హరికాంత్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఈ మనోహర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ శిక్షకులు డి విజయ ప్రకాష్, డా. ప్రదీప్‌రాజ్, డా మనోజ్‌కుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

నేడు డీఈఈ సెట్ ధ్రువపత్రాల పరిశీలన

తిమ్మాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ మొదటి సంవత్సరం 2024-25లో చేరేందుకు నిర్వహించిన డీఈఈ సెట్-2024లో ఉత్తీర్ణులై ఇప్పటి వరకు ఒరి జినల్ ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోని, రెండవ దశలో ప్రవేశం కోరే పాత కరీంనగర్ జిల్లాకు చెందిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలు పరిశీలించుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 గురువారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని డైట్‌లో పరిశీలన జరుగుతుం దని తెలిపారు. రెండవ దశ ప్రవేశాలకు ఆప్షన్స్ 7 నుంచి 9 వరకు పెట్టుకోవ చ్చని వివరాలకు డీఈఈ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కోరారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొడిమ్యాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గుట్టపై ఉన్న లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రథమ వార్షికోత్సవాన్ని వేద పండితులు జగనాథం విష్ణువర్ధనాచార్యులు, ఆలయ అర్చకులు నాగరాజు రమేష్ ఘనంగా చేపట్టారు. అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు, గ్రామస్థులకు అన్నదానం చేశారు. ఆలయంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ వారు గ్రామంలోని ప్రధాన వీధుల్లో ప్రత్యేక మైక్‌లను ఏర్పాటు చేశారు.

13 నుంచి బీఎస్సీ ఆనర్స్ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ మొదటి సెమిస్టర్ పరీక్షలు డిసెంబరు 13 నుంచి, మూడో సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 17నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మూడో సెమిస్టర్ పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

● హోటల్ మేనేజ్‌మెంట్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఎస్‌యూ పరిధిలో హోటల్ మేనేజ్‌మెంట్ ఒకటో, ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 13న ప్రారంభమై జనవరి2, 2025 వరకు కొనసాగుతాయని శాతవాహన పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఐదో సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

సెపక్‌తక్రా పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్ల ప్రతిభ

● రన్నరప్‌గా నిలిచిన బాలుర జట్టు

● తృతీయ స్థానం సాధించిన బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 సెపక్‌తక్రా పోటీల రన్నరప్‌గా ఉమ్మడి జిల్లా బాలుర జట్టు నిలి చింది. బాలికల జట్టు తృతీయ స్థానం సాధించింది. నిజామాబాద్ జిల్లా కామారెడ్డిలో ఈ నెల 1, 2, 3 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీ ఎఫ్ సెపక్‌తక్రా పోటీల్లో జిల్లా జట్టుకు ఆర్ హర్షవర్ధన్, మనోజ్, వివేక్, మాధవరావు, కల్యాణ్‌లు ప్రాతినిధ్యం వహించారు. బాలికల జట్టుకు ఆరా ధ్య, అశ్విత, చైతన్య, శరణ్య, కీర్తన ప్రాతినిధ్యం వహించారు. ఈ జట్టుకు జి కుమార్ కోచ్‌గా, సుమన్ మేనేజర్‌గా వ్యవహరించారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన జిల్లా జట్లను డీఈవో సీహెచ్ జనార్దన్ రావు, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి వేణుగోపాల్, డీవైఎస్‌వో బి శ్రీని వాస్‌గౌడ్, జిల్లా సెపక్ తక్రా సంఘం ప్రధాన కార్యదర్శి గసున్న విజ యభాస్కర్ రెడ్డి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి అభినందించారు.

జనవరి1 నుంచి యాసంగికి సాగునీరు

● రైతులు నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలి ● ఈఎన్సీ శంకర్

తిమ్మాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జనవరి 1 నుంచి యా సంగి పంటకు ఎల్ఎండీ నుంచి కాకతీయ కాలువ ద్వారా దిగువకు నీటిని విడుదల చేయనున్నట్లు కరీంనగర్ ఇరిగేషన్ ఈఎన్సీ శంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ఇంజ నీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఈఎన్సీ శంకర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం హైదారాబాద్‌లో జరిగిన శివం సమావేశంలో నిర్ణయించిన ప్రకారం నీటి విడుదల చేస్తామన్నారు. ఎల్ఎండిలో ప్రస్తుతం 23.732 టిఎంసీలు, ఎంఎంఆర్‌లో 26.73 టిఎంసీల నీరు ఉన్నట్లు తెలిపారు. వివిధ అవసరాలకు పోను ఎల్ఎండి, ఎంఎంఆర్‌లో కలిపి కేవలం 24.272 టిఎంసీల నీరు మాత్రమే ఈ సీజన్‌కు ఉంటాయని, దీనికి ఎస్ఆర్ఎస్‌పి నుంచి 5 టీఎంసీలు వాడుకొనే అవకాశం ఉంటుందని అన్ని కలిపి 29.282 టీఎంసీల నీరు ఈ యాసంగికి విడుదల చేయనున్నట్లు తెలిపారు. బోర్లు, బావుల్లో, చెరువుల్లో, కుంటల్లో కూడా నీటి నిల్వలు బాగానే ఉన్నాయని వాటితో పాటు విడుదల చేస్తున్న నీటిని రైతులు అవసరం మేరకే వినియోగించుకుని చివరి ఆయక ట్టు రైతులకు నీరు వచ్చే విధంగా సహకరించాలని ఈఎన్సీ కోరారు. నీటి లభ్యతను పరిగణలోకి తీసుకొని చివరి ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు వేసుకుంటే బాగుంటుందని సూచిం చారు. ఎల్ఎండి నుంచి కాకతీయ కాలువ ద్వారా జనవరి 1 నుంచి మార్చి 31 వరకు నిరం తరం నీటిని విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి డిస్ట్రిబ్యూటరీ కింద ఉన్న చివరి ఆయకట్టు వరకు నీటిని అందించాలని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించడం జరిగిందని, దానికి అనుగు ణంగానే చివరి ఆయకట్టుకు నీటిని అందించేం దుకు కృషి చేస్తామని అన్నారు. ఈసారి ఆరు తడులకు నీరు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

ప్రభుత్వం 89 మంది లష్కర్‌లను 12 మంది హెల్పర్‌లను నియామ కాలకు మంజూరు ఇచ్చిందని తెలిపారు. ఈ నియామ కాల్లో రోస్టర్ పద్ధతి ప్రకారం నిష్పక్షపాతంగా కోర్టు ఆదేశాల మేరకు నియామకాలు చేపడుతామ న్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈ రాధాకిషన్, ఈఈ నాగభూషణం ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఎన్సీ శంకర్

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



తాళ్ల జయశ్రీ

శంకరపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న తాళ్ల జయశ్రీ ఇన్‌స్పైర్ (ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్) కార్యక్రమంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సరిత తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నవంబరు 30, ఈ నెల 1,2వ తేదీల్లో కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ హైస్కూల్లో నిర్వహించిన 12వ ఇన్‌స్పైర్, 52వ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన జిల్లాస్థాయి కార్యక్రమంలో (పాస్వర్డ్ బేస్ట్ వేహికిల్ స్టాటర్ సిస్టమ్) పాస్వర్డ్‌తో నడిచే వాహనాల రూపకల్పన గురించి ప్రదర్శించే జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జనవరిలో జరగబోయే రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ కార్యక్రమానికి ఎంపికైందన్నారు. విద్యార్థిని జయశ్రీని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ టు ఏడిఈ ఏం లావణ్య తెలిపారు. సంతోష్‌నగర్, శ్రీహరినగర్, కూర్మవాడ, బడిగుడి, గణేష్‌నగర్, పిటిసి, పాల డెయిరీ, బుల్ స్టేషన్, కాంగ్రెస్ భవన్ ప్రాంతాలు, పద్మనగర్, శ్రీనగర్ కాలనీ, రామ చంద్రాపూర్ కాలనీ, సాయిబాబా ఆలయ ప్రాంతం, సప్తగిరికాలనీ, ఏవీఎస్ కాలనీ, లేక్ పోలీస్‌స్టేషన్ బైపాస్ ప్రాంతం, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన పలు వురు కుటుంబాలను మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో బుధవారం పరామర్శించారు. మాజీ ఎంపీ గొట్టె భూపతి సతీమణి, రాచకొండ పోలీస్ కమిషనర్ గొట్టె సుధీర్‌బాబు తల్లి శాంత ఇటీవల మరణించగా కరీంనగర్‌లోని ఒక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆమె పెద్దకర్మకు మంత్రి హాజరై నివాళులర్పించారు. అనంతరం మంకమ్మ తోటలోని డాక్టర్ శైలజ మామ ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్ళిన కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు.

ప్రొఫెసర్ గడ్డం రాంరెడ్డి జయంతి

భగత్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాంరెడ్డి విగ్రహం వద్ద ప్రొఫెసర్ గడ్డం రాంరెడ్డి జయంతిని ఆర్‌బివిఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం నాయ కులు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డిసంక్షేమ సంఘం కార్యదర్శి గోపాల్‌రెడ్డి,ఉపాధ్యక్షుడు గన్ను మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలు

సుభాష్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు బూర్ల విద్యాసాగర్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామానికి చెందిన 26 మందికి రేకుర్తి కంటి ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ చేయించినట్లు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కరీంనగర్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సన్న వడ్లకు బోనస్ చెల్లించి నందుకు దుర్శేడ్‌లో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు హరీష్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఎం, మంత్రి పొన్నం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మాజీ సీఎం రోశయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రోశయ్య వర్ధంతి సందర్భంగా బుధవారం కరీంనగర్ ఆర్య వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో టవర్ సర్కిల్‌లో రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసిన మంత్రి నివాళులు అర్పించారు.



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేదలకు అన్నప్రసాద వితరణను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లా డుతూ రోశయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు. ఆయన ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పుడు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 18 సంవత్సరాలు ఆర్థిక మంత్రిగా బడ్జెట్ ప్రవేశ పెట్టార న్నారు. ఆర్యవైశ్యులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అవకాశం కల్పిస్తుం దన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంటు ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, ఎస్ఆర్ శేఖర్, కంకణాల అనిల్ కుమార్‌గుప్తా, రాచర్ల పద్మ, ముక్క భాస్కర్, జొన్నల రమేష్, ప్యాట రమేష్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఎండి తాజ్, కోడూల రాహుల్, పులి ఆంజనేయులు గౌడ్, పడాల రాహుల్, శ్రావణ్ నాయక్. బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి. అబ్దుల్ రహమాన్, చర్ల పద్మ మల్లికార్జున రాజేందర్, ఆకారపు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం

కరీంనగర్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్‌లోని పరివార సమేత దుర్గా భవానీ దేవాలయంలో ఈనెల 7న సుబ్రహ్మణ్య స్వామి వారలకు కల్యాణ మహోత్సం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు వేముల వాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతిలు బుధవారం తెలిపారు. ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారలకు విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి పూజ కార్యక్రమాలు జరుగుతాయని, 10గంటలకు సుబ్రహ్మణ్య స్వామికి కళ్యాణ మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

'ఇస్కాన్ టెంపుల్ భూమి ఎందుకు రద్దు చేశారు?'

కరీంనగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన మూడెకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు రద్దు చేసిందో సమాధానం చెప్పాలని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న సివిల్ సప్లయిస్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ ప్రతి పండుగలకు కానుకలను ఇచ్చిందని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పండుగ కానుకలు పూర్తిగా బంద్ అయ్యాయని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నగరంలో ఇస్కాన్ టెంపుల్ నిర్మాణానికి భూమి కేటాయించడంతో పాటు కొన్ని నిధులు కూడా మంజూరు చేస్తూ జీవో విడుదల చేయడంతో పనులు కూడా ప్రారంభించారని అన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావుపై తప్పుడు కేసులు పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. ఈవిలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెంసారపు తిరుపతి, మహేశ్, తుల భాస్కర్‌రావు, పలువురు అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

'విజ్ఞాన యాత్రల పేరిట అల్ఫోర్స్ దోపిడీ'

కరీంనగర్ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన యాత్రల పేరుతో అల్ఫోర్స్ విద్యాసంస్థ కోట్ల రూపాయల దోపిడీ చేస్తోందని, దీన్ని ప్రభుత్వం అరికట్టాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థ విజ్ఞాన యాత్రల పేరుతో ప్రతి విద్యార్థి దగ్గర రెండు వేల ఒక వంద రూపాయలు వసూలు చేస్తోందని ఆరోపించారు. విద్యార్థుల నుంచి కోట్లాది రూపాయలను వసూలు చేసి ఆ డబ్బులను ఎమ్మెల్సీ ఎన్నికలకు ఖర్చు చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని విమర్శించారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవిలేకరుల సమావేశంలో బీసీ కుల సంఘాల నాయకులు శ్రీరాముల రమేశ్, తుల భాస్కర్‌రావు, గర్శకుర్తి విద్యాసాగర్, పొన్నం అనిల్‌గౌడ్, కిరణ్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విహారయాత్రపై రాజకీయం తగదు

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అల్ఫోర్స్ విద్యార్థుల విహారయాత్రపై రాజకీయం తగదని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్ రాజు అన్నారు. ఇటీవల కొంత మంది నరేందర్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అసత్య ఆరోపణ చేస్తున్నారని అన్నారు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి సంబంధించిన విహారయాత్రపై కూడా రాజకీయం చేయడం కొంత మంది అవివేకమని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా నరేందర్‌రెడ్డి గెలుపు ఆపలేరు అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రాచమల్లు రాజు,దొగ్గాలి శ్రీధర్,సిరిశెట్టి రాజేష్ గౌడ్,నారోజు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీజీవో కార్యవర్గం

సుభాష్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, ప్రధానకార్యదర్శి అరవింద్ రెడ్డి మంత్రిని శాలువాతో సత్కరించి, మొక్కను అందచేశారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, ట్రెజరీ డీడీ నాగరాజు, రామ్మోహన్, వెంకటేశ్వరరావు, రామచంద్రారెడ్డి, రాజేశ్వరి, గడ్డం సుధాకర్, లక్ష్మీనర్సింహరావు, రోహిత్, వీణ, మమత, అభినయ్‌రెడ్డి, రాజు, కొండల్‌రెడ్డి, రాజమహేందర్‌రెడ్డి, చంద్రకళ, రాజశేఖర్ రెడ్డి, జోయల్, రాకేశ్, హమీద్‌షా, రాజునాయక్ పాల్గొన్నారు.

నాస్ పరీక్షా కేంద్రాల తనిఖీ

కరీంనగర్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో నాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షా కేంద్రాలను బుధవారం మండల విద్యాధికారి రవీందర్ తనిఖీ చేశారు. బొమ్మకల్ శివారులోని జ్యోతిబాపూలే, మైనార్టీ పాఠశాలను, దుర్శేడ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, నగునూర్ గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట సీఆర్‌పి గాలిపల్లి రవీందర్ తదితరయలు పాల్గొన్నారు.

నియామకం

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సార్ కళాశాల జంతుశాస్త్ర విభాగ అధిపతిగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్రం జ్యోతిలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ సత్తు రమేష్‌బాబు స్థానంలో జ్యోతిలక్ష్మి బాధ్యతలు చేపట్టారు.

సైన్స్ ఫెయిర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభ

కరీంనగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (దన్గర్‌వాడీ) విద్యార్థి విజయేందర్ తృతీయ బహుమతి పొందినట్లు పాఠశాల హెచ్ఎం, ఎంఈవో ప్రమోద తెలిపారు. ఈ సందర్భంగా విజయేందర్‌ను హెచ్ఎం ప్రమోదతోపాటు ఇంచార్జి హెచ్ఎం ఎం.శ్రీనివాస్, సైన్స్ ఉపాధ్యాయుడు వి.రాజేశ్ అభినందించారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

భగత్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా దళిత రైట్స్ మూమెంట్ 2వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ పిలుపు నిచ్చారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బుధవారం దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 5, 6, 7వ తేదీల్లో హైదరాబాద్‌లో మహాసభలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని తిరుపతి, నక్క మల్లేష్, బోయిని అశోక్, కవ్వంపల్లి కొమురయ్య పాల్గొన్నారు.

ట్రినిటి కళాశాలలో ఆధునిక ల్యాబ్ ప్రారంభం


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ట్రినిటి కళాశాలల ఫౌండర్ దాసరి మనోహర్

కరీంనగర్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ల్యాబ్‌ను బుధవారం టాస్క్ సీఈవో శ్రీకాంత్ సింహ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం టాస్క్, ఏడునట్ ఫౌండేషన్ స్పాన్సర్‌షిప్‌తో విద్యార్థులకు ఉత్తమ నైపుణ్యాల సాధన కోసం ఉద్దేశించిందని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలల ఫౌండర్ దాసరి మనోహర్, చైర్మన్ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏడునట్ ప్రతినిధి అప్సార్ పాషా, ప్రదీప్ రెడ్డి, గంగా ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ నాగేంద్రసింగ్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఇంగ్లీష్ నోట్స్ ఆవిష్కరణ


ఇంగ్లీష్ నోట్స్ ఆవిష్కరిస్తున్న వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

గణేశ్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్న ధనపురి సాగర్ తయారు చేసిన డిగ్రీ ఒకటో సెమిస్టర్ నోట్స్‌ను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలో ఒకటో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు ఈ నోట్స్ ఉపయోగ పడుతుందని తెలిపారు. ఆంగ్ల అధ్యాపకుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ నోట్స్‌ను ఉచితంగా పొందాలంటే 8885549467 నంబర్‌కు వాట్సాప్ చేయాలన్నారు.

వీరగోని లక్ష్మి సంస్మరణ సభ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చల్మెడ వైద్య కళాశాలకు మరణానంతరం తన పార్థీవ దేహాన్ని దానం చేసిన వీరగోని లక్ష్మి సంసంస్మరణ సభ బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌లో నిర్వహించారు. ఈకార్యక్రమంలో రచయిత అల్లం రాజయ్య మాట్లాడుతూ గొప్ప మానవతా మూర్తి వీరగోని లక్ష్మి అని అన్నారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, కవి అన్నవరం దేవేందర్, కందుకూరి అంజయ్య పాల్గొన్నారు. వీరోగోని లక్ష్మి జ్ఞాపకాలను స్మరిస్తూ కుటుంబ సభ్యులు వీరగోని పెంటయ్య సహచరులు రాసిన స్మృతివ్యాసాలతో కూడిన అమ్మ అన్నపూర్ణ పుస్తకాన్ని మనువరాలు సాహితీ.. వెన్నెల ఆవిష్కరించారు. ఈ పుస్తక తొ లి ప్రతిని ప్రముఖ రచయిత అల్లం రాజయ్యకు అందించారు. ఈకార్యక్రమానికి సమన్వయకర్తలుగా బుర్ర తిరుపతి, జె.దేవదానంలు వ్యవహరించారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న పురాణం మహేశ్వరశర్మ

సుభాష్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలని పీఠాధిపతులు, హిందూ ఐక్యవేదిక నేతలు అన్నారు. హిందువులపై దాడులను నిరసిస్తూ బుధవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలో కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం లేదన్నారు. హిందువులకు రక్షణ కల్పించమని అడిగినందుకు ఇస్కాన్ స్వామిజీ న్యయ కృష్ణదాస్‌ను జైల్లో వేశారని అన్నారు. ఆయనకు అండగా నిలిన వారిపై దాడులు చేస్తూ మారణహోమం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ తీవ్రవాదుల దాడులు రోజురోజుకూ అధికమయ్యాయన్నారు. దీనిని హిందూ ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తుందన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి బంగ్లాదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ద్వారా భారత రాష్ట్రపతికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ అనుమండ్ల రాజిరెడ్డి, కోకన్వీనర్లు డాక్టర్ రమణాచారి, ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, రామ్‌కిరణ్, కిషన్, కిరణ్‌సింగ్, ఆది శ్రీనివాస్‌రావు, పీఠాధిపతులు సనకసనంద స్వామి, పురాణం మహేశ్వరశర్మ పాల్గొన్నారు.

కేజీబీవీలో దరఖాస్తులకు ఆహ్వానం

ఇల్లందకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పీఈటీ, పీజీ సీఆర్టీ నర్సింగ్ ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ స్పెషలాఫీసర్ ఎలిగేటి లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు మండల కేంద్రానికి చెందిన వారై ఉండాలని, 9849630792 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా రాహుల్


రాహుల్

హుజూరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా చల్లూరి రాహుల్ ఎన్నికయ్యారు. రెండు నెలల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా యువజన కాంగ్రెస్ ఎన్నికలు నిర్వహించగా, ఫలితాలను యువజన కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ బుధ వారం విడుదల చేసింది. నియోజకవర్గ అధ్యక్ష పదవికి 28మంది పోటీ చేయగా చల్లూరి రాహుల్ 3,228 ఓట్లతో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడిగా గెలుపొందాడు. తన గెలుపుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్, టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జీ తిప్పారపు సంపత్, కాంగ్రెస్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

● వీణవంక: మండలానికి చెందిన శీలం సురేందర్‌రెడ్డి మండల యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించారు. తన ఎన్నికకు కృషి చేసిన నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్‌కు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు

గంగాధర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర భవిత కేంద్రంలో దివ్యాంగులకు బుధవారం క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి కార్యక్రమంలో స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అనితా కుమారి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ మాధవి, స్పెషల్ ఎడ్యుకేటర్ స్వరూపరాణి, ఫిజియోథెరపీ డాక్టర్ విజయలక్ష్మీ,పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాగేశ్వరిలో నేషనల్ లెవల్ వర్క్‌షాప్


విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న అధ్యాపకులు

తిమ్మాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం పవర్‌క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోసియంను బుధవారం కళాశాల ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మొదటి రోజు ఎల్ఈడీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఎల్ఈడి ఆవశ్యకత, విద్యుత్ బల్బు తయారు చేయు విధానాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు ఫ్లాష్ మాబ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి డి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కన్వీనర్ చంద్రమౌళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి : సీడీపీవో

గంగాధర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టపరంగా విరుద్ధమని , ప్రతి ఒక్కరూ వాటిని అరికట్టాలని ఐసీడీఎస్ సీడీపీవో కస్తూరి అన్నారు. గంగాధర ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలన, చట్టాలు, అనర్థాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు ఆడపిల్లల భవిష్యత్తును దూరం చేస్తాయని, చిన్న వయస్సులో వివాహం చేసుకోవడంతో ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తుతాయని అన్నారు. బాలికలు చదువుపై దృష్టి సారించి తమ కాళ్లపై నిలబడే స్థాయికి ఎదగాలన్నారు. బాలికలపై జరిగే నేరాలకు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి బాలిక మనోధైర్యం కలిగి విద్యా ఉద్యోగ రంగాల్లో రాణించి తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలకు అందిస్తున్న రక్తహీనత నివారణ మాత్రల గురించి వివరించారు. కార్యక్రమంలో డీసీపీవో పర్వీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, ఎసీపీఎస్ కవిత పాల్గొన్నారు.


కురిక్యాలలో మాట్లాడుతున్న సీడీపీవో కస్తూరి

పరామర్శ

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 04 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య సోదరుడు పొనగంటి బుచ్చయ్య (63) బుధవారం అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్‌బాబు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పత్తి కృష్ణారెడ్డి, దేశిని కోటి, దేశిని సదానందం, సాయిని రవి, పర్లపల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు కౌలు రైతులు

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 04 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ సమీపంలోని సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కౌలు రైతుల ప్రజా దర్బార్‌కు మండలంలోని పాపక్కపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతులు బుధవారం తరలి వెళ్లారు. కార్యక్రమంలో కౌలు రైతుల కో-ఆర్డినేషన్ కమిటీ మెంబర్లు ముక్క ఐలయ్య, సామ్రాజ్యం, కన్నూరి సదానందం, రాచపల్లి సమ్మయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు టీ షర్టుల వితరణ

తిమ్మాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండీ కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిరమల్ క్యాపిటల్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో 50మంది విద్యార్థులకు టీ షర్టులను వితరణ చేశారు. పిరమల్ క్యాపిటల్ ఫైనాన్స్ ఉమ్మడి కరీంనగర్, సిద్దిపేట, మంచిర్యాల జిల్లాలకు చెందిన బ్రాంచ్ ఉద్యోగులు క్రీడా ఉత్సవ్ 2.0 పేరుతో పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంలో క్రీడలు నిర్వహిస్తున్నారు.

బాలికల గురుకుల పాఠశాల సందర్శన

హుజూరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం బీఆర్ ఎస్వీ గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బీఆర్ఎస్వీ పట్టణాధ్యక్షుడు అనురాగ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ వంట గదిని, పరిసరాలను పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ప్రిన్సిపాల్, సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థునిలతో మాట్లాడారు. కార్యక్రమంలో లావణ్య, ఉస్మాన్ ఉరేన్, శ్రీదేవి, కిరణ్, అను దీప్, అరవింద్, విజయ్, సాయి, ఆకాష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


వంటలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

పెద్దపల్లికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/జమ్మికుంట రూరల్/ఇల్లందకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో జరిగే కాంగ్రెస్ యువ వికాస సభకు హుజూరాబాద్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు నియోజకవర్గ ఇన్‌చార్జీ ప్రణవ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రణవ్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత, రైతులు పాల్గొన్నారు. జమ్మికుంట పట్టణం నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. హుజూరాబాద్ నియోజకవర్గ ఇంఛార్జ్ వొడితల ప్రణవ్‌బాబుతో కలిసి సీనియర్ నాయకులు దేశిని కోటి, దొంత రమేష్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఇల్లందకుంట మండలంలో నాయకులు సారంగపాణి, సంజీవరెడ్డి, వంగ రామకృష్ణ, సంపత్, గోపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కోడం రజిత, కనుమల్ల రామకృష్ణ, పెద్ది కుమార్, రవీందర్ తదితరులు సీఎం సభకు తరలివెళ్లారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

వీణవంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సిహెచ్ గణేష్ అన్నారు. మండలంలోని చల్లూరు గ్రామంలోని రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు ద్వారా రెండింతల లాభం ఉంటుందని తెలిపారు. వరి పంట తప్ప అన్ని పంటలు అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చని తెలిపారు. టన్ను గేల ధర రూ. 20,143 పలుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు రాకేష్, అచ్యుత్, శ్రావణ్, సంగీత, గౌతమి, లోహియా కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏవో గణేష్

సీఎం దిష్టిబొమ్మ దహనం

ఇల్లందకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని ఆరోపిస్తూ మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకుడు మట్ట పవన్‌రెడ్డి, గుత్తికొండ రాంబాబు, మురహరి గోపాల్, జగన్‌రెడ్డి, ఉమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

ఇల్లందకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమో రియల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గంగిశెట్టి జగదీశ్వర్ బుధవారం 150 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రాములు, హెచ్ఎం జయప్రకాష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

శంకరపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎంపీడీవో కృష్ణప్రసాద్ పరిశీలించారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు ఆర్పీ ఉమ బ్యాంకు రుణాల కోసం డబ్బులు డిమాండ్ చేస్తుందంటూ మహిళ సంఘాల సభ్యులు మున్సిపల్ కమిషనర్ ఎండి అయాజ్‌కు బుధవారం పిర్యాదు చేశారు. విచారణ చేపట్టి ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం కప్ నిర్వహణపై సమీక్ష

వీణవంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో మెరుగు శ్రీధర్ అధ్యక్షతన సీఎం కప్ ఆటల పోటీల నిర్వహణపై సమీక్ష జరిగింది. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో శోభారాణి, ఎస్ఐ తోట తిరుపతి, హెచ్ఎం అశోక్‌రెడ్డి, పీడీలు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

చొప్పదండి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్, సాంబయ్యపల్లిలో కోరుట్ల పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జాతీయ సేవా పథకంలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు.